నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: కిస్మత్‌పూర్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని పలు ఫీడర్లల్లో మంగళవారం విద్యుత్‌ ఉండదని ఏఈ ఎ.మల్లేష్‌రాజ్‌ ఒక ప్రకటనలో తెలిపారు.

◆ రాక్‌చర్చి ఫీడర్‌ పరిధిలో.. ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు శ్రీసాయి కాలనీ, ప్రభుత్వ స్కూల్‌, రాఘవేంద్ర కాలనీ, ఫైన్‌ ఆర్ట్స్‌ కాలనీ, ఎన్‌ఆర్‌బి టౌన్‌షిప్‌, రాధా రియాల్టీ, వివేకానంద కాలనీ, యాదాద్రి కాలనీ, ఓం నగర్‌ కాలనీ, ఎస్‌ఎం ఎన్‌క్లేవ్‌–1,2, సీఎల్‌ విల్లాస్‌, పూజా విల్లాస్‌, రాక్‌ చర్చి, కీర్తి విల్లాస్‌ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదని వినియోగదారులు గమనించాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ మొండ్ర సంగీతాగౌరీశంకర్‌

అత్తాపూర్‌: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి అయ్యేలా చూడాలని అత్తాపూర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మొండ్ర సంగీతగౌరీశంకర్‌ సూచించారు. అత్తాపూర్‌ డివిజన్‌ ఓల్డ్‌ అత్తాపూర్‌ పోచమ్మ దేవాలయం నుంచి హనుమాన్‌ దేవాలయం వరకు రూ.19.80 లక్షలతో నిర్వహిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య, స్టార్‌ చిన్న, సరితారెడ్డి, డి.సునీత, ఏఈ రాజేష్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజు, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

స్వెట్టర్లు పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌

మణికొండ: పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలకు ఐటీ సంస్థలు, సేవా సంస్థలు, దాతలు సహకరించాలని నార్సింగి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్‌ పత్తి ప్రవీణ్‌కుమార్‌ అన్నారు. సోమవారం నార్సింగి దళిత వాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఏసీఎస్‌ ఇన్నోవా సంస్థ వారు స్వెట్టర్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సంస్థలు తమ వంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్‌ డాక్టర్‌ ఉమేష్‌, ప్రతినిధులు మంజుల, విజయ్‌కుమార్‌, మోహిని, జోజి, హారిక, సత్యనారాయణరెడ్డి , రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



అత్తాపూర్‌: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన అత్తాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్సై ఎస్‌.బాలకిషన్‌ నాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌ ఎలివేటెడ్‌ వే పిల్లర్‌ నంబర్‌ 161 సమీపంలో వ్యక్తి మృతదేహం (55) ఉందని పోలీసులకు సమాచారం అందిందన్నారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా అప్పటికే మరణించి ఉన్నాడన్నారు. మృతుడి వివరాలు తెలుసుకునేందుకు స్థానికంగా వాకబు చేసిన ఎలాంటి సమాచారం అందలేదన్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే ఉస్మానియా మార్చురీ సిబ్బందిని గానీ, అత్తాపూర్‌ పోలీసులను గానీ సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీతాలు ఇవ్వాలంటూ ధర్నా

గచ్చిబౌలి: జీతాలు సకాలంలో చెల్లించాలంటూ కొండాపూర్‌ జిల్లా ఆస్పత్రి కాంట్రాక్ట్‌ ఉద్యోగులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ అనురాగినిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని శానిటేషన్‌, పేషెంట్‌ కేర్‌, సెక్యూరిటీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్‌ ఏజెన్సీలు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో శ్రావణ్‌ కుమార్‌, రాజు, సిద్ధి రాములు, సుబ్రహ్మణ్యం, మణెమ్మ, అమృత, మహ్మద్‌ అబేద్‌, రమ. నవ్య పాల్గొన్నారు.



ఫుట్‌పాత్‌ ఆక్రమణల తొలగింపు

హైదరాబాద్‌-బీజాపూర్‌ జాతీయ రహదారిలో ..



బండ్లగూడలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగింప జేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్‌..

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి, రోడ్లపై ఏర్పాటు చేసిన షెడ్డులు, దుకాణాల సముదాయాలను సోమవారం నార్సింగి ట్రాఫిక్‌ పోలీసులు తొలగించారు. భారీ బందోబస్తు మధ్య వీటిని కూల్చివేశారు. ఈ నెల 4వ తేదీ సాక్షి దినపత్రికలో పార్కింగ్‌... ఇష్టారాజ్యం అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ట్రాఫిక్‌, లా అండ్‌ ఆర్డర్‌, కార్పొరేషన్‌ అధికారులు అక్రమ పార్కింగ్‌లతో పాటు, ఫుట్‌పాత్‌ ఆక్రమణలను తొలగించారు. కార్పొరేషన్‌ పరిధిలోని టిప్పుఖాన్‌ బ్రిడ్జి నుంచి కాళీమందిర్‌ వరకు వెలిసిన దుకాణాలు, షాపులు, టీ స్టాల్స్‌, వ్యాపార సముదాయాలు తదితరాలను గుర్తించిన అధికారులు వాటిని జేసీబీల సహాయంతో కూల్చివేశారు. కార్పొరేషన్‌ పరిధిలో ఫుట్‌పాత్‌ ఆక్రమణలు రోజురోజుకూ పెరిగిపోతూ ప్రధాన జాతీయ రహదారి పొడవు రెండు వైపులా చిన్న చిన్న దుకాణాలు వెలిశాయి. కొద్దికొద్దిగా రోడ్డుపైకి వచ్చేశాయి. హైదరాబాద్‌-బీజాపూర్‌ జాతీయ రహదారి కావడంతో



ఎప్పుడు రద్దీగా ఉంటుంది. ఆక్రమణల కారణంగా పాదచారులు నడవడానికి వీలు లేకపోవడంతో జాతీయ రహదారిపైనే నడుస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో చర్యలు తీసుకున్నారు. ఈ కూల్చివేతల్లో రాజేంద్రనగర్‌ ఏసీపీ శ్రీనివాస్‌, రాజేంద్రనగర్‌ పోలీస్‌స్టేషన్‌ సీఐ కాస్ట్రో, నార్సింగి పోలీస్‌స్టేషన్‌ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌ సమరం రెడ్డి, ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ నిరంజన్‌రెడ్డి, ట్రాఫిక్‌ సీఐ ప్రదీప్‌, ఎస్సైలు రాజు, రాజేష్‌గౌడ్‌, ప్రభాకర్‌, బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ శరత్‌చంద్ర, టౌన్‌ప్లానింగ్‌ అధికారులు, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారుల వాగ్వాదం..

బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో ఆక్రమణల తొలగింపునకు జేసీబీలతో పాటు ట్రాఫిక్‌, లా అండ్‌ ఆర్డర్‌, కార్పొరేషన్‌ అధికారులు సిబ్బంది పెద్ద ఎత్తున తరలివచ్చారు. తమ పొట్ట కొట్టొద్దు అంటే స్థానిక వ్యాపారులు జేసీబీకి అడ్డుగా కూర్చున్నారు. పోలీసులు వారికి నచ్చజెప్పి కూల్చివేశారు.

బాధితులతో మాట్లాడిన మాజీ మంత్రి హరీష్‌రావు

జాతీయ రహదారిపై దుకాణాల తొలగింపు విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి హరీష్‌రావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అధికారులతో, వ్యాపారులతో ఆయన మాట్లాడారు. ప్రజలు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటుంటే వారిపై ఎందుకు దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని నిలదీశారు. బీఆర్‌ఎస్‌ పార్టీ బాధితులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మాజీ మంత్రి హరీష్‌రావు సంఘటన స్థలానికి చేరుకోవడంతో స్థానిక ప్రాంతానికి చెందిన నాయకులు, ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. దీంతో ట్రాఫిక్‌ స్తంభించింది.అధికారులు ఈ విషయాన్ని హరీష్‌రావుకు తెలిపి ఆయనను అక్కడ నుంచి పంపించి వేశారు.



బాధితులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

సీయూఈటీ-పీజీ పరీక్షలను ప్రాదేశిక భాషల్లో నిర్వహించాలి

రాయదుర్గం: విద్య సమానత్వం కోసం కామన్‌ యూనివర్సిటీ ఎంట్రెన్స్‌ టెస్ట్‌ ఫర్‌ పోస్టు గ్రాడ్యుయేట్‌ (సీయూఈటీ-పీజీ) పరీక్షలను ప్రస్తుత ద్విభాషా విధానమైన ఇంగ్లిష్‌ ,హిందీకి పరిమితం చేయకుండా ప్రాదేశిక భాషల్లో కూడా నిర్వహించాలని ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్‌ అసోసియేషన్‌ జాతీయ అధ్యక్షుడు, హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థి జి కిరణ్‌కుమార్‌ డిమాండ్‌ చేశారు. ఈ విషయంలో నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీ(ఎన్‌టీఏ) తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యంగా పల్లెల్లో, సామాజికంగా వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులెక్కువగా ప్రాదేశిక భాషల్లోనే విద్యనభ్యసిస్తున్నారని, వారికి పోటీ చేయడం కష్టతరం చేస్తోందన్నారు. సీయూఈటీ-పీజీ పరీక్షల్లో ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యం లేకపోవడం, ప్రభుత్వం ప్రతిపాదించిన సమానమైన విద్యా అవకాశాల లక్ష్యానికి విరుద్ధమన్నారు. ప్రాదేశిక భాషా ఎంపికలను ప్రవేశపెట్టాలని డిమాండ్‌ చేశారు.

మంత్రికి సన్మానం



శంషాబాద్‌: రాష్ట్ర వైద్యారోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహను సోమవారం పీసీసీ ఎస్సీసెల్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్‌ ఆధ్వర్యంలో సన్మానించారు. ఎస్సీ వర్గీకరణ అమలులో మంత్రి పాత్ర ఎంతో ఉంద కృతజ్ఞతలు తెలిపామన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ అధ్యక్షుడు ధనుంజయ్‌, విఘ్నేష్‌, ప్రణయ్‌, ఆకాష్‌, హర్ష తదితరులున్నారు.

యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వే



ప్రత్యేక సర్వేలో పాల్గొన్న అధికారులు

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ శివరాంపల్లి యూపీహెచ్‌సీ (అర్బన్‌ ప్రైమరీ హెల్త్‌ సెంటర్‌) ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సర్వే నిర్వహించారు. బీసీజీ టీకా వ్యాప్తిపై ప్రభుత్వం కొత్త నిర్ణయం తీసుకుంది. చిన్న పిల్లలకు ఇచ్చే బీసీజీ టీకాను ఇప్పుడు పెద్దలకు కూడా ఇవ్వడం ద్వారా క్షయవ్యాధి (టీబీ) నుండి రక్షణ కల్పించాలనే ఉద్దేశ్యంతో సర్వే చేపట్టింది. ఈ కార్యక్రమంలో 60 ఏళ్లు పైబడిన వారు, డయాబెటిస్‌ ఉన్న వారు, పొగ త్రాగేవారు ఇలా రిస్క్‌ గ్రూపు వ్యక్తులను గుర్తించి వారికి బీసీజీ టీకా వేసే చర్యలు చేపట్టారన్నారు. టీబీ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి- బీసీజీ టీకా రక్షణ కల్పిస్తుంది అనే సందేశంతో ఆరోగ్య శాఖ ప్రజలకు అవగాహన కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్‌ రహీం, నరేశ్‌, పబ్లిక్‌ హెల్త్‌ మేనేజర్‌ గౌరీ కె.ఎస్‌.కె, పబ్లిక్‌ హెల్త్‌ స్టాఫ్‌ భాగ్యలక్ష్మి, శిల్ప, జ్యోతి, లక్ష్మి, ఆశా వర్కర్లు చెన్నమ్మ, సారధి, అంబికా తదితరులు పాల్గొన్నారు.

మధుబన్‌ కాలనీలో వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై జయలక్ష్మి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ పరిధిలోని మధుబన్‌ కాలనీలో సోమవారం సాయంత్రం వాహన తనిఖీలను చేపట్టారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ ఎస్సై జయలక్ష్మి ఆధ్వర్యంలో తనిఖీలను నిర్వహించారు. హెల్మెట్‌ ధరించని, సీట్‌ బెల్ట్‌ వేసుకోని, లైసెన్స్‌ లేని వాహనాలతో పాటు సెల్‌ఫోన్‌ మాట్లాడుతూ డ్రైవ్‌ చేస్తున్న వారిని పట్టుకుని చలానాలు విధించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ట్రాఫిక్‌ నిబంధనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్‌ యాదగిరిరెడ్డి తదితరులున్నారు.

ప్రజావాణి.. 6 ఫిర్యాదులు

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆరు ఫిర్యాదులు అందినట్లు సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ డాక్టర్‌ రవికుమార్‌ తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన ఆరు ఫిర్యాదులను ఆయా అధికారులకు పంపామన్నారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజావాణిని సర్కిల్‌ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీసీ డాక్టర్‌ రవికుమార్‌

మానవత్వం చాటుకున్న ట్రాఫిక్‌ పోలీసులు



వ్యక్తిని అంబులెన్స్‌ ఎక్కిస్తున్న పోలీసులు

గచ్చిబౌలి: ట్రాఫిక్‌ పోలీసులు మానవత్వం చాటుకున్నారు. గచ్చిబౌలి ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధి నానక్‌రాంగూడ ఔటర్‌రింగురోడ్డు నుంచి గచ్చిబౌలి మార్గంలో సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరగడంతో కానిస్టేబుల్‌ ప్రభు, హోంగార్డ్‌ శేఖర్‌ అక్కడి చేరుకున్నారు. అప్పటికే ఓఆర్‌ఆర్‌పై ఓ వ్యక్తి గాయాలపాలై పడి ఉండడాన్ని గమనించారు. వెంటనే సపర్యలు చేసి నీళ్ళు తాగించారు. అనంతరం 108 అంబులెన్స్‌కు ఫోన్‌ ద్వారా సమాచారం అందించారు. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. వాహనదారులు కానిస్టేబుల్‌, హోంగార్డును అభినందించారు.

కార్వాన్‌ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

గోల్కొండ: కార్వాన్‌ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్‌ అన్నారు. సోమవారం టోలిచౌకీ, మెరాజ్‌ కాలనీలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మెరాజ్‌ కాలనీలో స్థానికులను కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ పొంగిపొర్లడంపైనే తనకు ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తూ డ్రైనేజీలు పొంగిపొర్లకుండా చర్యలు తీసుకోవాలని జలమండలి, బల్దియా అధికారులను కోరామన్నారు. అదే విధంగా డ్రైనేజీ మ్యాన్‌హోళ్లకు మూతలు లేకపోవడంతో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. ధ్వంసమైన మ్యాన్‌హోళ్ల మూతలను తొలగించి వాటి స్థానంలో నాణ్యమైన మ్యాన్‌హోళ్ల మూతలు వేయిస్తున్నామన్నారు. ఆయన వెంట నానల్‌నగర్‌ కార్పొరేటర్‌ మహ్మద్‌ నసీరుద్దీన్‌, నాయకులు అలీముద్దీన్‌ తదితరులున్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్‌

రాజేంద్రనగర్‌ డిగ్రీ కాలేజీ- అబీస్‌ కాస్మోటిక్‌ సైన్స్‌ ఎంఓయూ

శంషాబాద్‌: రాజేంద్రనగర్‌ (శంషాబాద్‌) ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో సింగపూర్‌ విశ్వవిద్యాలయం ఎంఓయూ కుదుర్చుకుంది. అబీస్‌ ఇన్‌స్టిట్యూట్‌ కాస్మోటిక్‌ సైన్స్‌ ఆన్‌లైన్‌ ద్వారా కోర్సులు అందించేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సింగపూర్‌ వర్సిటీ అంతర్జాతీయ సెమినార్‌లో కళాశాలకు చెందిన అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ సామ రవీందర్‌రెడ్డి పలు పరిశోధనలు సమర్పించారు. ఆ వేదికపై సామ రవీందర్‌రెడ్డి అభ్యర్థన మేరకు ఈటబుల్‌ కాస్మోటిక్స్‌పై చర్చించిన అబీస్‌ కాస్మోటిక్‌ సైన్స్‌ ఇన్‌స్టిట్యూట్‌ రాజేంద్రనగర్‌ డిగ్రీ కళాశాలతో పాటు షాద్‌నగర్‌లోని మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఆన్‌లైన్‌ కోర్సులు నిర్వహించేందుకు ముందుకు వచ్చింది.ఫ్రాన్స్‌లోని యూరోపియన్‌ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంతో ఈ సంస్థ కలిసి పనిచేస్తోందన్నారు. కాస్మోటిక్స్‌ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలుండడంతో కళాశాలలో ఈ కోర్సును ప్రవేశపెడితే ప్రధానంగా విద్యార్థినులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు.



అబీస్‌ కాస్మోటిక్‌ సైన్స్‌ కేంద్రంతో ఎంఓయూ కుదుర్చుకున్న అసిస్టెంట్‌ ప్రొ.రవీందర్‌రెడ్డి

కొడంగల్‌కు తరలిన బీఆర్‌ఎస్‌ నాయకులు



కొడంగల్‌కు తరలివెళ్లిన బీఆర్‌ఎస్‌ నాయకులు

మణికొండ: కొడంగల్‌ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్‌ఎస్‌ పార్టీ నిర్వహించిన రైతు దీక్ష కార్యక్రమానికి మణికొండ మున్సిపాలిటీ నుంచి బీఆర్‌ఎస్‌ నాయకులు తరలివెల్లారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు అప్పా సర్కిల్‌లో స్వాగతం పలికి ఆయనతో పాటు కొడంగల్‌కు బయలుదేరి వెల్లారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతులకు అనేక హామీలిచ్చి వదిలేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కె. ధన్‌రాజ్‌, జి.నరేందర్‌, జి.విఠల్‌, బి.మల్లేష్‌, దిలీప్‌, బి.బాబు, మాల్యాద్రినాయుడు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఆరీఫ్‌ మహ్మద్‌, సుమ నళిని పాల్గొన్నారు.

నేడు ఏఐ కీలకం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ హిమబిందు

శంషాబాద్‌: నైపుణ్యం ఉన్నవారికి మెరుగైన ఉపాధి అవకాశాలున్నాయని రాజేంద్రనగర్‌ (శంషాబాద్‌) ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ హిమబిందు సూచించారు. అనేక రంగాల్లో ఇప్పుడు ఏఐ పాత్ర కీలకంగా మారిందన్నారు. మహిళా సాధికారతలో భాగంగా సోమవారం డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు లెర్నింగ్‌ లింగ్‌ ఫౌండేషన్‌ సహకారంతో ఏర్పాటు చేసిన కృత్రిమ మేధ (ఏఐ) పదిరోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ.. పోటీ సమాజంలో నిలదొక్కుకునేందుకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ భవాని, అధ్యాపకులు భాను ప్రకాష్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ హిమబిందు

వీధి లైట్ల నిర్వహణపై సమీక్ష

మైలార్‌దేవ్‌పల్లి: వీధి లైట్ల నిర్వహణలో లోపాలు లేకుండా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రాజేంద్రనగర్‌ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జీ, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ కార్పొరేటర్‌ తోకల శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం కాటేదాన్‌లోని తన కార్యాలయంలో డార్క్‌ స్ట్రీట్‌ లైట్‌ ఇన్‌స్పెక్టర్‌, మెయింటెనెన్స్‌ టీమ్‌ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్‌ పరిధిలో అనేక ప్రాంతాల్లో స్ట్రీట్‌ లైట్స్‌ వెలగకపోవడంతో ప్రజలు రాత్రి పూట ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీమ్‌ను పెంచాలని డీఈ రామారావును కోరారు. ప్రజలకు సమస్య వస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్ట్రీట్‌ లైట్‌ ఇన్‌స్పెక్టర్‌ పోలజు సురేందర్‌, ఈఈఎస్‌ఎల్‌ మహేందర్‌రెడ్డి, ఐఎఫ్‌ఎస్‌ఎల్‌ శ్రీకాంత్‌, ఐఎఫ్‌ఎస్‌ఎల్‌ ఇంజనీర్‌ నర్సింగ్‌, భారత్‌, జీహెచ్‌ఎంసీ స్ట్రీట్‌ లైట్‌ వర్కర్స్‌ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

పేదలకు అండగా ఉంటాం

మణికొండ రెడ్డి ఫౌండేషన్‌ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రెడ్లతో పాటు ఇతర కులాల పేదలను ఆదుకుంటామని మణికొండ రెడ్డి ఫౌండేషన్‌ అధ్యక్షుడు కె. నరేందర్‌ రెడ్డి అన్నారు. ఇటీవల మున్సిపాలిటీ పరిధిలోని సుజాత అనే నిరుపేద మహిళ బస్సులో ప్రయాణిస్తూ బ్రేక్‌ వేయటంతో తీవ్రంగా గాయపడింది. ఆమె వెన్నుముకకు సంబంధించి బాధపడుతుండడంతో ఆసుపత్రి ఖర్చులకు డబ్బులు లేని విషయాన్ని తెలుసుకుని ఆమె కూతురు సాత్వికకు రూ.25వేల ఆర్థిక సహాయాన్ని ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, వివాహాలకు తమ అసోసియేషన్‌ తరపున ఆర్థికసాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌ కె. రామకృష్ణారెడ్డి, నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, శ్రీపతిరెడ్డి, రామసుబ్బారెడ్డి, శరత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్యామ్‌ రెడ్డి, సుభాష్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, పి.సైదిరెడ్డి, కె.రామిరెడ్డి, గణేష్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అసుపత్రి ఖర్చులకు ఆర్థిక సహాయం అందించిన రెడ్డి ఫౌండేషన్‌ నాయకులు

వాహనం దొరికితే సీజ్‌..

ట్రాఫిక్‌ పోలీసుల స్పెషల్‌ డ్రైవ్‌.. మైనర్లు, లైసెన్స్‌ లేని వారిపై కేసులు నమోదు



చింతల్‌మేట్‌ చౌరస్తా వద్ద మైనర్ల నుంచి స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ ట్రాఫిక్‌ పోలీసులు స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నారు. ద్విచక్ర వాహనాలను నడుపుతున్న మైనర్‌లతో పాటు లైసెన్స్‌ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు. ప్రధాన రహదారులతో పాటు బైపాస్‌ రోడ్లు, బస్తీలు, కాలనీల నుంచి వచ్చే వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. గత నెల రోజుల వ్యవధిలోనే 150కి పైగా కేసులను నమోదు చేయడం గమనార్హం. ప్రస్తుతం మైనర్లతో పాటు లైసెన్స్‌ లేకుండా నడుపుతున్న వారిపై దృష్టి సారించారు.

నిబంధనలు పాటించకపోతే..

ప్రస్తుతం ట్రాఫిక్‌ పోలీసులు లైసెన్స్‌ లేకుండా వాహనం నడిపినా.. మైనర్లు వాహనం నడుపుతూ దొరికినా... వాహనాలను సీజ్‌ చేస్తున్నారు. కేసులను నమోదు చేయడంతో పాటు వాహనాలను జప్తు చేస్తూ స్టేషన్‌కు తరలిస్తున్నారు. ఈ వాహనాలను విడిపించాలంటే.. న్యాయమూర్తి ఆదేశించిన రుసుం లేదా జైలు శిక్ష అనంతరం వాహనాలను అందజేస్తారు.

వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు..

మైనర్లు వాహనాలతో రోడ్లపై దూసుకెళుతున్నారు. వీరిని కట్టడి చేసేందుకు ట్రాఫిక్‌ పోలీసులు చేపట్టిన స్పెషల్‌ డ్రైవ్‌లో వాహనం నడిపించిన మైనర్‌తో పాటు వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తున్నారు. గతంలో వాహన యజమానిపై ఎలాంటి కేసులు ఉండేవి కావు. ప్రస్తుతం వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తుండటంతో వారు లబోదిబోమంటున్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు : ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజేందర్‌ గౌడ్‌

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు. వాహనం నడుపుతూ పట్టుబడితే మైనర్‌తో పాటు వాహన యజమానిపై కేసు నమోదవుతుంది. కేసులతో పాటు వాహనంను సీజ్‌ చేస్తాం. కోర్టులో జైలుశిక్షతో పాటు అపరాధ రుసుం విధించే అవకాశముంది. వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలి.